క్లుప్తంగా...

వాటర్ కంట్రోల్ పాయింట్‌కు మరమ్మతులు



మరమ్మతులను చేయిస్తున్న రాహుల్‌కుమార్ తదితరులు

జియాగూడ: వర్షాకాలం వల్ల పలు లోతట్టు ప్రాంతాల్లో తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నందునా ఆయా ప్రాంతాల్లో డ్రింక్ వాటర్ కంట్రోల్ పాయింట్ల వద్ద లీకేజీల మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని జియాగూడ బీజేపీ ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు బగిడి రాహులు కుమార్ అన్నారు. గురువారం జియాగూడ సంజయనగర్‌లో దిగువన ఉన్న వాటర్ కంట్రోల్ పాయింట్‌కు మరమ్మతులు చేసి నూతనంగా నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై సంబంధిత సెక్షన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయగా వెంటనే అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



టోర్నమెంట్ జెర్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులకు సరైన ప్రోత్సాహాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆల్ తెలంగాణ గ్రామీణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జెర్సీ, వాల్‌పోస్టర్‌ను ఆమె గురువారం ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భువనేశ్వరీ మాట్లాడుతూ..ఈనెల 29, 30వ తేదీల్లో దోమలగూడలోని వ్యాయామ కళాశాలల్లో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్, సాయిపవన్ తదితరులు పాల్గొన్నారు.

భారత భాగ్య సమృద్ధి యజ్ఞాన్ని విజయవంతం చేయాలి



దూద్‌బౌలి: సీతారాంబాగ్ శ్రీరామ మందిరంలో నిర్వహించనున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞాన్ని విజయవంతం చేయాలని యాగం నిర్వాహకురాలు, లతామా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవిలత కొంపెల్ల అన్నారు. దూద్‌బౌలిలోని సిద్ధిబుద్ధి వినాయక ఆలయ ప్రాంతంలో స్థానికులతో కలిసి సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 27న ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో సంకీర్తన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ మాజీ అధ్యక్షులు యెమన్ సింగ్, బస్తీవాసులు సోమేశ్, సత్యనారాయణ, యేషుబాయి, ఆనంద్, నిరంజన్ కుమార్‌తో పాటు ప్రమోద్ కుమార్, శ్రద్ధానంద్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలి



నిరసన తెలుపుతున్న ఎంఎస్‌పీ నాయకులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ నర్సింహారావు మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన బీజేపీ సంవత్సరాలు గడుస్తున్నా వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రస్తుత సమావేశాలలో వర్గీకరణ బిల్లు పెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేని యెడలా రాబోయే ఎన్నికల్లో బీజేపీ తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా నాయకులు పి.రవిమాదిగ, కిషన్ మాదిగ, గజ్జెల రాజశేఖర్ మాదిగ, అజిత్ వాల్మీకి, రాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గణపతి.. ప్రణమిల్లె జగతి

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణనాథుల మండపాల వద్ద మండప నిర్వాహకులు గురువారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నేతలు మండపాల వద్దకు వచ్చి వినాయకులను దర్శించుకున్నారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



ఉస్మాన్‌గంజ్‌లో..



లాల్‌బాగ్ మల్లికార్జున్‌నగర్‌లో..



మీరాలమండి ఆలయంలో..



డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో..



లంగర్‌హౌజ్‌లో.. అమర్‌సింగ్ తదితరులు



ఓంనగర్‌లో.. నందకిశోర్ వ్యాస్, మమతా గుప్తా



ఫీల్‌ఖానాలో..అజిత్ హిందుజ, వేణుగోపాల్‌రావు



చందన్‌వాడిలో లచ్చుగుప్తా ఆధ్వర్యంలో..



ఆల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కేఎస్.నగర్‌లో..



నవోదయనగర్‌లో..



ఆలిజాకోట్లా తుల్జా భవానీ ఆలయంలో..



హనుమాన్‌నగర్‌లో..



ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అభివృద్ధి పనులు వేగవంతం



మంత్రి తలసానికి సమస్యలు వివరిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్ కుమార్‌గౌడ్ మంత్రి తలసానికి నియోజకవర్గంలోని పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ..అన్ని శాఖల అధికారులు వేగవంతంగా సమస్యలు పరిష్కరిస్తారన్నారు. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు, గణేష్ నవరాత్రి సందర్భంగా రేయింబవళ్ల పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో పాటు శేఖర్, పరిషిత్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారాన్ని వైరల్ చేస్తే చర్యలు తప్పవు



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీసీపీ సాయి చైతన్య

చార్మినార్: ఈసారి వినాయక నిమజ్జనోత్సవాలతో పాటు మిలాదున్‌నబీ వేడుకలు ఒకేరోజు రావడంతో ఇరువర్గాలలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించడం కోసం తాము సున్నితమైన అన్ని ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. గురువారం రాత్రి పాతబస్తీలోని కీలకమైన ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సాయి చైతన్య మాట్లాడుతూ..ఇరువర్గాలలో శాంతి, సామరస్యాన్ని భంగం చేసేటట్టు ప్రయత్నించే వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రచారానికి పూనుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నామన్నారు. దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి చిహ్నం.. భాగ్యనగరం



అవార్డులను ప్రదానం చేస్తున్న జస్టిస్ వామన్‌రావు

సుల్తాన్‌బజార్: శాంతి, ఐక్యత మత సామరస్యానికి భాగ్యనగరం చిహ్నంగా నిలుస్తుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ట్రిబ్యూనల్ కోర్టు చైర్మన్ జస్టిస్ వామన్‌రావు అన్నారు. సుబేదార్ అమీర్ అలీఖాన్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ అండ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ శాంతి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వమత ప్రజలు నివసిస్తున్న భాగ్యనగరం ప్రపంచ దేశాలకు ఆదర్శమని ఇక్కడి సాంస్కృతి, సాంప్రదాయాలు మనందరికి గర్వకారణమన్నారు. అన్ని మతాలు శాంతి సమైఖ్యతను బోధిస్తాయన్నారు. మహాత్మా గాంధీ అహింసా మార్గంలో ముందుకు సాగినట్లు అదే మార్గంలో నేటి యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొ. పురుషోత్తమ్‌రెడ్డి, సంస్థ చైర్మన్ ఫారూఖ్ అలీఖాన్, డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, డాక్టర్ మేజర్ జయసుధ, అక్తర్ అలీ, రవితేజ ప్రసంగించారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలి



మాట్లాడుతున్న హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్

యాకుత్‌పురా: ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్ అన్నారు. హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్ర ధనస్సు 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం భవానీనగర్ తలాబ్‌కట్టాలోని అరేబియన్ జీనోరియన్ మదర్సా పాఠశాలలో ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఈ వ్యాధి నిరోధక టీకాలు పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాదులన్నారు. వ్యాక్సినేషన్ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను ఆయన వివరించారు. వ్యాక్సినేషన్‌తో ప్రాణాంతకమైన వ్యాధుల నుండి పిల్లలను రక్షించవచ్చునన్నారు. మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా లెఫ్ట్ అవుట్, డ్రాప్ అవుట్ పిల్లలకు టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, నాయకుల పాత్ర ముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకళ, డాక్టర్ ఎం.ఎ.ఆయేషా, డాక్టర్ మురారి, డాక్టర్ శైలజా, డాక్టర్ బీర్జున్నీసా, డాక్టర్ సునంద, శ్రీనివాస్ రావు, షబ్బీర్ పాల్గొన్నారు.

దసరాకు టీఎస్ఆర్టీసీ రాయితీ

అఫ్జల్‌గంజ్: దసరా పండుగ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు సుభవార్త తెలిపింది. ఈనెల 20 నుంచి 30వ తేదీల్లో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణం టికెట్‌పై పది శాతం రాయితీని కల్పిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ఈ రాయితీ పొందాలంటే ప్రయాణికులు అక్టోబర్ 10 నుంచి 29వ తేదీ మధ్యలో ప్రయాణించాల్సి ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మజ్లిస్-ఇ-ఆజా వార్షికోత్సవం




దట్టీ కడుతున్న రామ్ మోహన్ తదితరులు

చార్మినార్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా అన్సారన్-ఇ-హుస్సేన్ సల్లాలాహీ అల్‌హైవస్సలాం వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.రామ్‌మోహన్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన మజ్లిస్–ఈ–ఆజా వార్షికోత్సవ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్ మోహన్ దంపతులు ఆయనకు ఇమామే దట్టీ కట్టి స్వాగతం పలికారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురికి 12వ ఎంఎం కోర్టు నాలుగు రోజుల జైలు, రూ.3300ల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ వారంలో మొత్తం 33 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవ్వగా.. రెండోసారి పట్టుబడిన ఏడుగురికి నాలుగు రోజుల జైలు, రూ.3300ల జరిమానా, రెండు నెలల పాటు ఒకరి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్, మొదటి సారి పట్టుబడిన మిగిలిన 25 మందికి రూ.2100 జరిమానా విధించింది. ట్రాఫిక్–3 డీసీపీ ఎం.శ్రీనివాస్, చార్మినార్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ రావు పర్యవేక్షణలో ఈ డ్రైవ్ కొనసాగింది.

మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్



దబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.రవీందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్.ఆనంద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజల కోసమే మజ్లిస్ పార్టీ



ఉచిత ఆరోగ్య బీమా క్యాంప్‌లో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీ ప్రజల కోసమే ఆవిర్భవించిందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్యశ్రీ సేవా కేంద్రాలను పరిశీలించారు. ముందుగా ఆయన హకీంపేట్, టోలిచౌకి, ఎండీలైన్స్‌లలో ఉన్న ఆరోగ్యశ్రీ క్యాంప్‌లను సందర్శించి అక్కడ జరుగుతున్న ఉచిత ఆరోగ్యశ్రీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గోల్కొండ రేతిగల్లీలోని జీఎంకే ప్రైమ్ షాదీఖానాలో ఉన్న ఉచిత ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం ఉచిత ఆరోగ్యశ్రీ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించామని మీ సేవా కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ కార్డు పొందాలంటే నిర్ధారిత చార్జీలు చెల్లించాలని అయితే మజ్లిస్ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఉచితంగా ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్నామని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకి డివిజన్ నాయకులు హారూన్‌ఫరాన్, బదర్‌ఉద్దీన్, హబీబ్‌చౌష్ తదితరులున్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



నైబర్‌హుడ్ కమిటీ ప్రతినిధులతో గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి అక్బర్‌పురాలో శ్రీ వివేకానంద నైబర్‌హుడ్ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ.. మండప నిర్వాహకులు వినాయక నిమజ్జనం జరిగే వరకూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సాయంత్రం జరిగే పూజా కార్యక్రమాల సమయంలో కూడా మండప పరిసరాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. ఈ సంవత్సరం వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ ఒకేసారి వస్తున్నాయని నిమజ్జనం వివరాలను మండపాల నిర్వాహకులు క్రమం తప్పకుండా పోలీసులకు తెలుపుతూ ఉండాలని ఆయన అన్నారు. అనంతరం శ్రీ వివేకానంద సేవా సమితి వారు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆనంద్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూమి పొరల్లో విలువైన ఖనిజాలు

విజయనగర్‌కాలనీ: భూమి ఉపయోగాలు, విలువైన ఖనిజాలు, నీటి లభ్యత ఇతర సంపద గుర్తింపు అనే అంశంపై మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో వర్క్‌షాప్ నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కవితా దరియానిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్, ప్రొఫెసర్ వి.ఫణిశ్రీ మాట్లాడుతూ..నేలలో నిక్షిప్తమై విలువైన ఖనిజ సంపద ఉందన్నారు. కచ్చితత్వాం, ప్రణాళిక, నిర్వహణ, సిస్టమేటింగ్ ఓవర్ వ్యూ, పరిశోధనల్లో ఎదురయ్యే సవాళ్లు, అధిగమించే మార్గాలు తదితర అంశాలపై పలువురు ప్రొఫెసర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.కుమార్, ప్రొఫెసర్ రవి ఆనంద్, డాక్టర్ సంధ్యారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్‌కు మంచి ఆదరణ



కందిమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పవర్ లిఫ్టింగ్‌కు అన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉందని హైదరాబాద్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కంది మోహన్‌రెడ్డి అన్నారు. చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఆయనను గురువారం పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.త్యాగరాజు మాట్లాడుతూ.. పవర్ లిఫ్టింగ్‌కు దశాబ్ద కాలంగా ఆదరణ బాగా పెరిగిందని, నగరానికి చెందిన యువకులు పవర్ లిఫ్టింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసెఫ్ జెమ్స్, కోశాధికారి టి.కౌశిక్ తదితరులున్నారు.

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మెరుపు ధర్నా



ఎంజేమార్కెట్‌లో మెరుపు ధర్నాలో సోమశేఖర్ మాదిగ, సుధాకర్‌మాదిగ తదితరులు

అబిడ్స్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకు ఇంకెన్నాళ్లు అని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంజేమార్కెట్ చౌరస్తాలో మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కలిపించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జనపాల మహేష్ మాదిగ, ఇతర ప్రతినిధులు కొమ్ము శేఖర్ మాదిగ, ఎడెల్లి శ్రీకాంత్ మాదిగ, మంద అనిల్ మాదిగ, ప్రశాంత్ మాదిగ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. బేగంబజార్ పోలీసులు వారిని అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శాస్త్రీయ కళలపై మక్కువ కల్పించాలి



గెలుపొందిన చిన్నారులతో బుర్రా వెంకటేశం

గన్‌ఫౌండ్రీ: నేటితరం చిన్నారులకు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం రవీంద్రభారతిలో నటరాజ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కేసీఆర్ ఉండగా 'ప్రతిరోజు పండగ' అనే శీర్షికతో జాతీయ డ్యాన్స్ ఫెస్టివల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ అంశాలపై జాతీయస్థాయి పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, నటరాజ్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్.గిరి తదితరులు పాల్గొన్నారు.

హబీబ్‌నగర్‌లో అర్ధరాత్రి హంగామా

నాంపల్లి: రౌడీషీటర్ ఇంట్లో జరిగిన పురుడు పోసే కార్యక్రమంలో బుధవారం అర్ధరాత్రి హంగామా చోటుచేసుకుంది. కుమారుడి పుట్టాడన్న సంతోషంలో రౌడీషీటర్ హిజ్రాలతో సంబురాలు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా గంజాయిని సేవిస్తూ హిజ్రాలతో కలిసి స్టెప్పులు వేశారు. మితిమీరిన డీజే శబ్దాలతో హంగామా సృష్టించి స్థానికులకు భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దర్గా యూసుఫియన్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దర్గా యూసుఫియన్ వెనుక వైపు రౌడీషీటర్ అక్బర్ అలియాస్ చోర్ అక్బర్ నివాసం ఉంటున్నారు. రౌడీషీటర్ అక్బర్‌కు ఇటీవల కుమారుడు జన్మించిన సంతోషంలో ఇంట్లో వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు హిజ్రాలను ఆహ్వానించి సంబురాలు చేసుకున్నారు. ఈ సంబురాల్లో భాగంగా రౌడీషీటర్ అక్బర్ గంజాయిని సేవించి హిజ్రాలతో కలిసి స్టెప్పులు వేశారు. రాత్రంతా బస్తీలో ఏర్పాటు చేసిన వేదికపై మితిమీరిన డీజే చప్పుళ్లతో విద్యుత్ కాంతుల నడుమ అసభ్యకరంగా నృత్యాలు చేస్తూ స్థానికులను భయాందోళనకు గురిచేశారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

అఫ్జల్‌గంజ్: మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థలు, కోఠి సమితి కన్వీనర్ విశ్వేశ్వర శాస్త్రి తెలిపారు. గురువారం తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు 18 బ్యాచ్‌ల ద్వారా దాదాపు 600 మంది ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. 19వ బ్యాచ్‌ను నేడు ప్రారంభించామని 100 రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు తోప్‌ఖానాలోని సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో లేదా 88865 09410లో సంప్రదించాలని సూచించారు.